ఈనాడు
అనకాపల్లి
సోమవారం 7 అక్టోబరు 2024

తీరంలో తోడేస్తున్నారు!

నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాల హవా సాగకపోవడంతో అక్రమార్కుల కన్ను తీర ప్రాంతంపై పడింది. ఏవిధమైన అనుమతులు లేకుండానే సముద్ర తీరప్రాంత గ్రామాల్లోని జీడితోటల్లో ఇసుక మేటలను తరలిస్తున్నారు. రాత్రిపూట గుట్టుగా తవ్వకాలు సాగిస్తున్నారు. నిర్మాణాలకు పనికి రాని నాసిరకం ఇసుకను గృహ నిర్మాణదారులకు అంటకడుతున్నారు.



కుమారపురం వద్ద తరలించేందుకు సిద్ధం చేసిన ఇసుక

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఇసుక తవ్వకాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని అక్రమార్కులు నిశీధి వేళను ఎంచుకుంటున్నారు. తీరప్రాంత గ్రామమైన పాయకరావుపేట మండలం కుమారపురం శివారు రత్నాయంపేటలో రొయ్యల చెరువుల సమీపంలో నెల రోజుల నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండానే ఇసుక అమ్మకాలు చేస్తున్నారు. ఇక్కడ ఉన్న జీడితోట యజమానులతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారు. ట్రాక్టరుకు వారికి రూ. 2 వేల చొప్పు ఇస్తూ

రాత్రివేళ గుట్టుగా ఇసుక తవ్వకాలు

బయట వారికి రూ.7 వేలకు అమ్ముతున్నారు. ఇక్కడ నుంచి రోజుకు 8 ట్రాక్టర్లతో సుమారు 50 ట్రిప్పుల ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసుల రాకపోకల సమాచారాన్ని తెలుసుకునేందుకు కొంతమంది వ్యక్తులను తవ్వకందారులే నియమించుకున్నారు. సమాచారం చేరవేస్తున్నందుకు వారికి ట్రాక్టరుకు రూ. 200 వరకు ఇస్తున్నారు. రాత్రిపూట గస్తీ కాస్తూ అధికారుల వచ్చే సమాచారాన్ని చరవాణిలో అందిస్తున్నారు. దీంతో పాటు కేశవరం, రాజవరం, రాజానగరం, పాల్మన్‌పేట, కొర్లాయంపేట సముద్ర తీరప్రాంతం నుంచి నాటుబళ్లు, ట్రాక్టర్లపై సముద్రపు ఇసుకను తరలిస్తూ అమ్మకాలు చేస్తున్నారు. తవ్వకాలతో చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వాస్తవానికి అధికారులతో సమావేశం నిర్వహించిన ప్రతిసారి హోంమంత్రి వంగలపూడి అనిత ఇసుక, గ్రావెల్ తరలింపుపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు ఇస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వీటిని అరికట్టడంలో అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది.



తవ్వకాలతో చెరువులా మారిన భూమి

నాసిరకం ఇసుకతో ఇబ్బందులు

వాస్తవానికి తీరప్రాంతాల్లో దొరికే ఇసుక గృహ నిర్మాణాలకు వాడకూడదు. కేవలం పునాదుల్లో నింపడానికి, ఇతర అవసరాలకు మాత్రమే వాడాలి. దానికి విరుద్ధంగా నదుల్లోని ఇసుకను తీసుకువస్తున్నామంటూ యజమానులను మభ్యపెట్టి అక్రమార్కులు అమ్మకాలు సాగిస్తున్నారు. దీనివల్ల ఇళ్లకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. ఈ ప్రాంతాల నుంచి మండలంలోని పలు గ్రామాలు సహా తుని, తొండంగి మండలాలకు సైతం ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



పగటిపూట అడ్డుగా వేసిన కంచె

● తీరంలో తవ్వకాలపై తహసీల్దారు జయప్రకాష్‌ను వివరణ కోరగా తవ్వకాల నిలిపివేతకు చర్యలు చేపడతామని చెప్పారు. దీనిపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వివరించారు.



భజనలు చేస్తున్న భక్తులు



చౌడువాడలో దుర్గా దేవి అంబలం పూజ నిర్వహిస్తున్న గురు భవానీలు

చౌడువాడలో అంబలం పూజ

కె.కోటపాడు: చౌడువాడలో దుర్గాదేవి అంబలం పూజ ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. కొమార ముత్యాలనాయుడు, సాయి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటైన పూజకు భవానీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వృత్తివిద్య పాఠాలతో భవితకు బాటలు

‘పీఎంశ్రీ’ పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ

రోలుగుంట, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరుతో ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సులు బాలలను ఆకట్టుకుంటున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సులు ప్రారంభమయ్యాయి. జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశ వ్యాప్తంగా 14,500 పాఠశాలల్లో అమలవుతున్నాయి. తొలి విడతగా మండలానికో పాఠశాలను ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎంపిక చేసిన పాఠశాలల్లో అదనపు వసతుల కల్పన, ప్రయోగశాలల ఏర్పాటు, క్రీడామైదానాల అభివృద్ధి, కెమిస్ట్రీ ల్యాబ్‌ల ఏర్పాటు చేయడంతోపాటు ఆయా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. పీఎంశ్రీలో ఎంపికైన రోలుగుంట ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులను 40 మంది చొప్పున రెండు బ్యాచ్‌లుగా విభజించారు. వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, వైద్య రంగం తదితర విభాగాలను సెలవు రోజుల్లో సందర్శిస్తూ శిక్షణ ఇస్తున్నారు. రోలుగుంట ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల తీరు, వ్యవసాయ రంగంపై అవగాహనకు ఎరువుల గోదాంల పరిశీలన, సమీపంలోని చిన్నతరహా పరిశ్రమల్లో ఆయా వస్తువుల తయారీ, కార్మికుల పని విధానం తదితర అంశాలపై అధ్యయనం చేయించారు. శిక్షకులుగా శ్యామల, నాగమణి, పద్మావతి వ్యవహరించారు. విద్యార్థి దశ నుంచే ప్రాక్టికల్ నాలెడ్జి పెరగడంతోపాటు జీనవ నైపుణ్యాలు పెంచుకునేందుకు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ చెబుతున్నారు.



వైద్యసేవల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పథకానికి ఎంపికైన గిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసిందని ప్రధానోపాధ్యాయుడు బాజ్జీరావు తెలిపారు. ఈ పథకంలో ఎంపికైన హెల్త్‌కేర్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో పది రోజులు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకువెళ్లి వాటి నిర్వహణపై అవగాహన కల్పిస్తామన్నారు. వీరి శిక్షణకు బాలికల సంరక్షణ అధికారి పద్మ, వృత్తివిద్య సమన్వయకర్తలు కరణం శ్రీదేవి, రమేష్‌లను ప్రత్యేకంగా నియమించారన్నారు. ఆదివారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

సెంచరీ కొట్టిన టమాటా



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: కిలో టమాటా ఏకంగా రూ.100కి చేరింది. ఆదివారం పెదబొడ్డేపల్లి రైతుబజారులో వ్యాపారులు ఈ ధరకు వీటిని విక్రయించారు. టమాటాలు కూడా చిన్న సైజువే కావడం గమనార్హం. భారీ వర్షాలు, తెగుళ్ల కారణంగా చిత్తూరు సమీపంలోని మదనపల్లె ప్రాంతంలో దిగుబడులు తగ్గడమే ధర పెరగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. గత వారం కిలో రూ.50కే అమ్మేవారు. క్రమేపీ రూ. 70, రూ. 80 చొప్పున పెరుగుతూ శనివారం నుంచి వందకు ఎగబాకింది. డిసెంబరు నుంచి నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ పంట దిగుబడి వస్తుందని, అప్పటికీ ధరలు తగ్గుతాయని చెబుతున్నారు. రావులపాలెం నుంచి వచ్చే దొండకాయలు గతంలో కేజీ రూ. 20కి అమ్మేవారు. ఇప్పుడు రూ. 60కి పెరిగింది. బీరకాయలు కిలో రూ. 70కి తగ్గడం లేదు. హైబ్రిడ్ మునగకాడ రూ. 20 చెబుతున్నారు. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పచ్చిమిర్చి ధరలు నిలకడగా ఉన్నాయి.

సరికొత్తగా మధ్యాహ్న భోజనం

■ మెనూ మార్పుపై అభిప్రాయాల సేకరణ
■ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక


పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో ఇకపై మార్పులు చేయనున్నారు. వంటకాల జాబితాలో కొత్త రకాలు రానున్నట్లు తెలుస్తోంది. గత వైకాపా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మెనూ అమలు కాలేదు. వారు పెట్టిందే మెనూగా ఉండేది. జగనన్న గోరుముద్ద పేరుతో అందిస్తున్న మెనూ సక్రమంగా లేదని మార్పులు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. మెనూ నచ్చకపోవడంతో చాలా మంది విద్యార్థులు అయిష్టంగానే భోజనాలు చేస్తున్నారు. మరికొందరు తినడంలేదు.



కొప్పాకలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు పూర్తి స్థాయిలో నచ్చిన మెనూ అందించే విధంగా రూపకల్పనకు చర్యలు చేపట్టింది. జిల్లా స్థాయిలో చర్చించి మెనూలో మార్పులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు, విద్యార్థులు యాజమాన్య కమిటీ సభ్యులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, పథకం నిర్వాహకులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఉన్న 1406 పాఠశాలల్లో లక్షన్నర మంది విద్యార్థులు ఉన్నారు. నిత్యం లక్షమందికిపైగా విద్యార్థులు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కొత్త మెనూ రూపొందించడానికి వీలుగా అభిప్రాయాలు సేకరించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ అందరితో సమావేశాలు నిర్వహించి విద్యార్థులు అడుగుతున్న మెనూపై చర్చించారు. ఇటీవల జిల్లాస్థాయిలో చర్చించి రూపొందించిన నివేదికను కలెక్టర్‌కు అందించారు. అన్నం సాంబారు, గుడ్డుతో కూర, స్వీటు, జీరా రైస్‌తో పాటు పలు రకాలు ఈ అభిప్రాయాల్లో తెలిపినట్లు తెలుస్తోంది. ఈ నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి పంపారు. ఇలా రాష్ట్ర స్థాయిలో వచ్చిన అభిప్రాయాలను పరిశీలించి కొత్తమెనూ రూపకల్పనకు చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది.



ప్రస్తుతం అమలవుతున్నమెనూ ఇలా

సోమవారం: కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, వేరుశనగ బెల్లం చిక్కీ

మంగళవారం: పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు, రాగిజావ

బుధవారం: కూరగాయల అన్నం, ఆలూకుర్మా ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కీ

గురువారం: సాంబార్ బాత్ లేదా లెమన్ రైస్, టమాటా పచ్చడి, ఉడికించని కోడిగుడ్డు

శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కీ

శనివారం: ఆకుకూర అన్నం, పప్పుచారు, స్వీట్‌పొంగల్, రాగిజావ

నివేదిక అందించాం

ప్రభుత్వ పాఠశాలల్లో మెనూపై అభిప్రాయాలు సేకరించాం. పాఠశాలల్లో విద్యార్థులు, పథకం నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల మాట్లాడాం. ఎవరు ఏ మెనూ అడిగారనే వివరాలను రూపొందించాం. కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి నివేదిక అందించాం.

– వెంకటలక్ష్మమ్మ, డీఈవో

ఈ మెనూపై విద్యార్థులు చాలా మంది విద్యార్థులు పెదవి విరుస్తున్నారు. ఎక్కువ మంది సోమవారం, శుక్రవారాల్లో కోడిగుడ్డు తినడానికి ఆసక్తి చూపడడం లేదు. ఆలూకుర్మా, పచ్చడి, రాగిజావ సైతం విద్యార్థులు దూరంగా ఉంటున్నారు. ఆయా రోజుల్లో ఈ వంటకాలు వండినా తినకపోవడంతో పారేయాల్సి వస్తోంది. విద్యార్థులు ఇష్టానికి అనుగుణంగా మెనూ రూపొందించాలని కూటమి సర్కార్ భావిస్తోంది.

గ్యాస్ లీకై ఒకరి మృతి

★ మరో ఇద్దరి పరిస్థితి విషమం
★ ఇటుకల పరిశ్రమ ఆవరణలో ప్రమాదం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి మండలం లైనుకొత్తూరు వద్ద జాతీయ రహదారిని అనుకొని ఉన్న ఫ్యూజన్ ఇటుకల పరిశ్రమకు చెందిన కార్మికుల నివాసంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎలమంచిలి సీఐ ధనుంజయరావు, ఎస్సై ఉపేంద్ర కథనం ప్రకారం.. ఈ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు నివాసం ఉండేందుకు 12 రేకుల షెడ్లు ఉన్నాయి. వీటిలో ఓ షెడ్‌లో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహని గ్రామానికి చెందిన ఎం.లోక్‌నాథ్, అదే గ్రామానికి చెందిన శాంతినగర్ కాలనీకి చెందిన జి.కృష్ణారెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం పత్రిపుట్టుగ గ్రామానికి చెందిన బి.కేశవరావు ఉంటున్నారు. విధులు పూర్తి చేసుకొని పక్కనే ఉన్న ఈ షెడ్‌లోకి ఈ కార్మికులు వెళ్లారు. అప్పటికే వంట గ్యాస్ లీకై షెడ్ అంతా వ్యాపించింది. వెంటనే తలుపులు తీసి వంట చేసుకోవడానికి ఉపక్రమించారు. గ్యాస్ పొయ్యి వెలిగిస్తుండగా అప్పటికే గ్యాస్ లీక్ అయి గది అంతా వ్యాపించి ఉండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి షెడ్‌పై రేకులు ఎగిరిపోయాయి. ఈ ప్రమాదంలో ఈ ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి, ఇక్కడి నుంచి విశాఖలో ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. ఈ ముగ్గురికి కేజీహెచ్‌లో చికిత్స అందిస్తుండగా కేశవరావు ఆదివారం మృతి చెందాడు. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సీఐ, ఎస్సై ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గ్యాస్ లీక్ కావడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కేశవరావు (పాత చిత్రం)



ఘటనా స్థలంలో సిలెండర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

పనిలో చేరిన నాలుగు నెలలకే మృత్యువాత

పొట్టకూటి కోసం పనిలోకి చేరి నాలుగు నెలలైనా పూర్తికాలేదు. ఇంతలో ప్రమాదం రూపంలో మృత్యువు అతడిని కబళించింది. దసరా పండగకు వస్తానని ఫోన్‌లో చెప్పి 24 గంటలు గడవక ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడన్న సమాచారం కుటుంబ సభ్యులను కలచివేసింది. లైనుకొత్తూరులో గ్యాస్ లీకై మృతి చెందిన బి.కేశవరావు (52) స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం పోత్రిపుట్టు. ఈ ఏడాది జూన్‌లో ఈ పరిశ్రమలో చేరాడు. ఈయనకు భార్య రాజులమ్మ, శ్రీకాంత్, సిసింద్రీ ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య గ్రామంలో కూలీ పనులు చేస్తుంది. కొడుకులు చదువుకుంటున్నారు. కుమార్తెకు వివాహానికి చేసిన అప్పులు తీర్చడానికి గ్రామంలో కూలీపని దొరక్క ఇక్కడ పనిలో చేరాడు. తోటి కార్మికులతో కలిసి ఇక్కడ కంపెనీ యాజమాన్యం నిర్మించిన రేకుల షెడ్‌లో ఉంటున్నారు. వంటగ్యాస్ లీకై వీరుంటున్న గదిలో పేలుడు జరగడంతో తీవ్రంగా గాయపడి, విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పేలుడు ధాటికి గది పైకప్పు ఎగిరిపోయి ముక్కలైంది. పరిశ్రమలో అగ్ని నిరోధక పరికరాలు లేకపోవడం, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచకపోవడంతో వీరికి సకాలంలో చికిత్స అందించలేకపోయారు. కేశవరావు మృతదేహాన్ని కేజీహెచ్‌లో మార్చురీకి తరలించారు. దసరాకు ఇంటికి వస్తున్నానని చెప్పాడని, ఇంతలో చావు కబురు వచ్చిందని మృతుడి భార్య రాజులమ్మ బోరున విలపిస్తోంది. బాధిత కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం రూ. కోటి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ ఎలమంచిలి మండల కమిటీ కార్యదర్శి చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు.

మోదకొండమ్మ సన్నిధిలో కలెక్టర్ దంపతులు

పాడేరు, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ అమ్మవారిని ఆదివారం కలెక్టర్ దినేష్‌కుమార్, ఆయన సతీమణి, అనకాపల్లి కలెక్టర్ విజయ్ కృష్ణన్, పిల్లలు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు కలెక్టర్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు తరలివచ్చారు. వస్త్ర వ్యాపారి త్రినాథ్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న కోటిబాబునాయుడు తదితరులు

తాతయ్యబాబు ప్రమాణ స్వీకారం 10న

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబు ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఆ రోజు మధ్యాహ్నం ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి నేతలను ఆదివారం కలిసి ఆహ్వానాలు అందజేశారు. భీమిలి, మాడుగుల ఎమ్మెల్యేలు గంటా శ్రీనువాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, నాయకులు దాడి వీరభద్రరావు తదితరులు తాతయ్యబాబును సత్కరించి అభినందించారు.



తాతయ్యబాబును సత్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మాజీ ఎమ్మెల్యే కన్నబాబు ఇంట్లో చోరీ

రాంబిల్లి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు (కన్నబాబు) ఇంట్లో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. దొంగలు రాంబిల్లిలోని ఆయన ఇంటి తలుపు గడియలు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించారు. పూజగదిలో వెండి వస్తువులు పట్టుకుపోయారు. వీటి విలువ రూ. 50 వేల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో రూ. 50 వేల నగదు పట్టుకుపోయినట్లు బాధితుడు పి.సంతు చేరి తెలిపారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు ఆయన చెప్పారు. చోరీలపై ఆదివారం ఫిర్యాదులు అందడంతో పోలీసులు క్లూస్ బృందాలను రప్పించి దర్యాప్తు చేస్తున్నారు. చోరీలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ సీహెచ్.నరసింగరావు చెప్పారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కశింకోట విద్యార్థుల ప్రతిభ

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 3 నుంచి విజయవాడలో నిర్వహించిన అండర్-17 విభాగంలో 60 కేజీల విభాగంలో కశింకోటకు చెందిన కె.అఖిల్ రజత పతకం, 51 కేజీల విభాగంలో బి.రోహిత్ కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు వి.ప్రభాకరరావు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులు అఖిల్, రోహిత్

ఆట్యాపాట్యాలో బాలికల సత్తా

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నానికి చెందిన బాలికలు రాష్ట్ర స్థాయి ఆట్యా పాట్యా పోటీల్లో పతకాలు సాధించారు. నెల్లూరులో ఆట్యాపాట్యా సంఘం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఈ పోటీలు జరిగాయి. తొమ్మిదో సబ్ జూనియర్స్ విభాగంలో బాలికల జట్టు ద్వితీయ స్థానంలో, బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలను సంఘ కార్యదర్శి గోపీకృష్ణ, విద్యాంజలి పాఠశాల ఛైర్మన్ అక్షజ్‌కృష్ణ, కరస్పాండెంట్ శాంతి, పీఈటీ అప్పారావు అభినందించారు.



ఆట్యా పాట్యా పోటీల్లో పతకాలు సాధించిన నర్సీపట్నం బాలికలు

అయిదు దశాబ్దాల తరవాత ఆనందంగా..


డ్యాన్స్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఒకచోట కలిశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వయస్సును మరిచి అంతా సరదాగా నృత్యాలు చేశారు. కష్ట, సుఖాలను పంచుకున్నారు. అంత్యాక్షరి ఆడుతూ సరదాగా గడిపారు. ఒకసారి ఏటా కలవాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి సామూహిక భోజనాలను చేశారు. ఆనాడు తమకు చదువు చెప్పిన కొంతమంది గురువులను సత్కరించారు.

పరిచయం ముందు.. ఆపై మత్తుమందు!!


సమావేశంలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో హనీట్రాప్ బాధితులు చాలా మంది ఉన్నట్లు గుర్తించామని.. వీరంతా ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. ఇప్పటికే విశాఖ నగరంలో రెండు హనీట్రాప్ కేసులు నమోదయ్యాయని, ఇందులో ప్రధాన నిందితుల ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నగర పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. యువకులను ముగ్గులో దింపి ఆపై డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న యువతిపై తొలుత భీమిలి స్టేషన్‌లో కేసు నమోదైన నేపథ్యంలో మరో బాధితుడు ముందుకొచ్చి కంచరపాలెం స్టేషన్‌లో అదే నిందితురాలిపై ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా డబ్బున్న వారిని లక్ష్యంగా చేసుకుని వల వేయటం జరుగుతోందని.. ఇదంతా ఓ ముఠా పథకం ప్రకారమే చేయిస్తోందని వెల్లడించారు. అరెస్టయిన నిందితురాలికి ఆ ముఠానే శిక్షణ ఇచ్చి రంగంలోకి దించిందన్నారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా డిజిటల్ మార్కెటింగ్ పేరిట పరిచయాలు ఏర్పరచుకుని, ఆ తర్వాత బాధితులకు మత్తు మందు ఇచ్చి తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారన్నారు. అలాగే పలు ఫొటోలు, వీడియోలను చిత్రీకరించి.. బ్లాక్‌మెయిల్‌కు పాల్పడతారని, కుటుంబ సభ్యులను కూడా బెదిరించి అందినంత దోచుకుంటారన్నారు.

☛ నగరంలోకి గంజాయి ఏ రూపంలో వచ్చినా గుర్తించేందుకు తగిన కిట్లు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు, సిబ్బందితో సిటీ పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు.

అనకాపల్లి/ పట్టణం న్యూస్‌టుడే

చెత్త సేకరణకు వసూలు చేస్తున్న పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అనకాపల్లి పట్టణ ప్రజలకు ఏడాదికి రూ. 3.67 కోట్ల భారం తప్పనుంది.

చెత్తపన్నుకు చెల్లు..

పట్టణవాసులకు తగ్గిన భారం రూ.3.67 కోట్లు

ఇంటికి రూ. 120 చెత్తపన్ను వసూలు చేయాలని మూడేళ్ల క్రితం అప్పటి వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఇంటి పన్నులు భారీగా పెంచిన పరిస్థితుల్లో ఈ చెత్త పన్ను ఏమిటని అధికారులను నిలదీసేవారు. అధికారులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రజల నుంచి స్పందన వచ్చేది కాదు. ఉన్నతాధికారులు సిబ్బందిపై ఒత్తిడి తెచ్చేవారు. ప్రభుత్వ పథకాలు నిలిపి వేస్తామని కొంత మంది వాలంటీర్లు, సచివాలయం కార్యదర్శులు భయపించి వసూలు చేసేవారు. పన్ను చెల్లించకపోతే చెత్త సేకరించమని చెప్పి మరి కొందరు వద్ద వసూలు చేసేవారు.

జోన్ పరిధిలో 28,135 ఇళ్లు ఉన్నాయి. మురుగువాడలలో ఉన్నవి 9,519 ఇళ్లు. వాణిజ్య భవనాలు 1,410 కాగా అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు 788. మిగిలిన 16,418 సాధారణ ఇళ్లు. మురికివాడల్లో ఇళ్లకు నెలకు రూ. 60. మిగిలిన ఇళ్లకు రూ. 120 వసూలు చేసేవారు. సకాలంలో చెల్లించకపోతే నెలకు రూ. 15 అపరాధ రుసుం వసూలు చేసేవారు. వాణిజ్య విభాగాలు చెల్లించకపోతే అపరాధ రుసుం రూ. 100 చెల్లించాల్సి వచ్చేది. వాణిజ్య విభాగంలోని భవనాలకు వ్యాపారాన్ని బట్టి నెలకు రూ. 300 వరకు వసూలు చేసేవారు. ఇలా మొత్తం ఏడాదికి రూ. 3.67 కోట్లు ప్రజల నుంచి చెత్త పన్ను పేరుతో రాబట్టేవారు.

ఎన్నికల సమయంలోనే చెత్త పన్ను రద్దు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. తాజాగా గాంధీ జయంతి రోజున ముఖ్యమంత్రి దీన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చెత్త తీసుకెళ్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

హామీ అమలు



పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడం, వీధిదీపాలు వెలిగించడం వంటి పనులు చేయాలి. దీనికోసం ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం. గత ప్రభుత్వం ప్రత్యేకంగా చెత్త పన్ను వసూలు చేసేది. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో చెత్త పన్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి రద్దు చేశారు.

– మళ్ల గౌరి, గృహిణి, గవరపాలెం

మంచి నిర్ణయం



వైకాపా ప్రభుత్వం ఇంటి పన్నులు పెంచేసింది. చెత్తకు పన్ను వసూలు చేసేవారు. చెత్తను తాము రహదారులపై వేయడం లేదు. వాహనం వచ్చినప్పుడు అందులో వేస్తున్నాం. ఏటా రూ. 720 చెల్లించాలంటే డబ్బు ఎక్కడ నుంచి తేవాలి. కూటమి నాయకులు అధికారంలోకి వస్తే చెత్త పన్ను ఉండదని చెప్పి అన్నట్లే రద్దు చేశారు.

– గొర్లి ప్రజ్ఞ, భీమునిగుమ్మం

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నం గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి సీహెచ్ **కిరణ్** కుస్తీ పోటీల్లో రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించిన అండర్-14 విభాగం కింద 58 కిలోల కేటగిరిలోని రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కిరణ్ పాల్గొన్నాడు. మూడో స్థానంతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పీఈటీ వినోద్ ప్రత్యేకంగా అభినందించారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో..



అచ్యుతాపురం: సౌత్‌జోన్-1 హ్యాండ్ బాల్ పోటీల్లో అచ్యుతాపురం మండలం మార్టూరుకు చెందిన **గట్టు మురళీ** జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 27 నుంచి ఈనెల 1 వరకు హైదరాబాద్‌లో ఈ పోటీలు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈపోటీలకు హాజరయ్యారు. పాయకరావుపేట శ్రీప్రకాశ్ విద్యానికేతన్ తరఫున అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న మురళీ ప్రతిభ చూపడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 7 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జాతీయ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పలువురు ఇతనిని అభినందించారు.

పేరులో వింత!


– న్యూస్‌టుడే, అచ్యుతాపురం

పూడిమడక మత్స్యకారులకు అరుదైన చేప చిక్కింది. మత్స్యకారులు నత్తి చేపగా దీనిని పిలిస్తారు. ఈ గ్రామానికి చెందిన మత్స్యకారుడు దీనిని రూ.1600 కొనుగోలు చేశాడు.

కొండకర్ల ఆవ అందాలు అద్భుతం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల ఆవ అందాలు సహజసిద్ధంగా అద్భుతంగా ఉన్నాయని ఎస్పీ ఎం. దీపిక అన్నారు. తన భర్త, కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్, కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం బోటులో ఆవలో షికారు చేశారు. గంటకుపైగా ఆవలో తిరిగిన ఆమె తామరాకులు, కమలం పువ్వులను కోస్తూ ఆనందంగా గడిపారు. కశ్మీర్‌లోని దాల్ సరస్సు మాదిరిగా చుట్టుకొండలు, స్వచ్ఛమైన నీరు బాగున్నాయన్నారు. మత్స్యకారులతో మాట్లాడి వారి జీవనోపాధిపై ఆరా తీశారు. ఆవలో లభించే చేపలు, ఆవకు వచ్చే ప్రకృతి ప్రేమికుల కోసం ఎస్పీ ఆసక్తిగా తెలుసుకునే ప్రయత్నం చేశారు. బోటు షికారు బాగుందని మత్స్యకారులతో ఆమె అన్నారు. సీఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.


కొండకర్ల ఆవలో కుటుంబ సభ్యులతో ఎస్పీ దీపిక

ఐక్యంగా కదిలే.. గొంతెత్తి నినదించే..!

ఉక్కునగరం, న్యూస్‌టుడే: విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ మానవహారం నిర్వహించారు. విశాఖ శివారు అగనంపూడి నుంచి గాజువాక వరకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన మానవహారంలో ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు పాల్గొని చేయి చేయి కలిపారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినదించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు శిబిరంలో మాట్లాడారు. కర్మాగారాన్ని పరిరక్షిస్తామని కేంద్రం చెబుతున్నా... ఒప్పంద కార్మికుల తొలగింపు, శాశ్వత కార్మికుల ఇంటి అద్దె కోత, సకాలంలో వేతనాల చెల్లింపు లేకపోవడం.. కార్మికులను భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, చిత్రంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నీళ్లకు నిలకడ మంత్రం

- జలసిరిని ఒడిసిపడితేనే ఫలితం
- నీటి సంక్షోభం నుంచి నగరానికి విముక్తి
- ఏపీఫెర్వాస్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం

రోజుకు మనిషికి అవసరమైన నీరు: **135 లీటర్లు**

జీవీఎంసీ పరిధిలో సరఫరా: **95 లీటర్లు**

120 మిలియన్ గ్యాలన్లు (ఎంజీడీ) తాగునీరు, పరిశ్రమలకు అవసరం

ప్రస్తుతం సరఫరా: **85(ఎంజీడీ)**


ఈనాడు, విశాఖపట్నం

వేసవి వస్తే...కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందక ఇబ్బందులు. వర్షాకాలంలో కాలువలు, గెడ్డల ద్వారా సముద్రంలో వృథాగా కలిసే వాన నీరు. - ఏటా విశాఖలోని కొన్ని కాలనీల్లో కనిపించే దృశ్యాలివే.

దీనికి కాలనీల స్థాయి నుంచే పరిష్కారం వెతకాలని ఆంధ్రప్రదేశ్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య(ఏపీ ఫెర్వాస్) ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారు. ఇంకుడు గుంతలు తవ్వించి జల సంరక్షణకు కృషి చేస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుంటే భవిష్యత్తులో నీటి కొరతను కొంతైనా అధిగమించొచ్చు.


శ్రీనూకాంబిక కాలనీలో ఇంకుడు గుంత


విశ్రాంత ఉద్యోగులే అధికం..: నగరంలో జేఆర్ నగర్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం 15 ఇంకుడు గుంతలు తవ్వారు. ప్రతి అపార్ట్‌మెంట్, ఇల్లు, పార్కు, ఖాళీ స్థలాల్లో సరైన స్థలం ఎంపిక చేసుకుని వీటిని నిర్మించారు. ఫలితంగా ఏడాదికి సుమారు 7,45,000 లీటర్ల నీటిని ఆదా చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఏపీఫెర్వాస్‌లో అధిక శాతం విశ్రాంత ఉద్యోగులే. సమాఖ్య అధ్యక్షుడు ఉదయ్, సహాయ అధ్యక్షుడు కేవీఎస్ఆర్ మూర్తి, సంయుక్త కార్యదర్శి ఎం. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 150 కాలనీల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంకల్పించారు. తొలి విడతగా సింహాచలం, కూర్మన్నపాలెం, కిర్లంపూడి, ఎంవీపీ, మధురవాడ, తిరుమలనగర్, అడవివరం, మద్దిపాలెం, వుడా లేఅవుట్ తదితర ప్రాంతాల్లో 60కి పైగా గుంతలు తవ్వారు.




జేఆర్ నగర్ కాలనీలో..

ప్రతి ఇంట్లోనూ పూర్తిస్థాయిలో ఇంకుడు గుంతలుండాలి. దాతల సహకారం అందిస్తామని చెప్పినా పలు కాలనీల్లో ముందుకు రాలేదు. జీవీఎంసీ సహకారం అందిస్తే పార్కులు, ఖాళీ స్థలాల్లో గుంతల నిర్మాణానికి సలహాలు, సూచనలు అందిస్తాం.

– కేవీఎస్ఆర్ మూర్తి, సహాయ అధ్యక్షుడు, ఏపీ ఫెర్వాస్



దేశంలో 2030 నాటికి 40 శాతం ప్రజలకు తాగునీరు అందదని నీతి ఆయోగ్ పేర్కొంది. వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో మూడేళ్లకోసారి నీటి కొరత తీవ్రమవుతోంది. ఏటా వేసవిలో జీవీఎంసీ ట్యాంకర్లతో నీటి సరఫరాకు రూ. 4 నుంచి రూ. 5 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 12 వేలు ఖర్చవుతుంది. విశాఖలో ఏడాదికి సాధారణంగా 1000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని ఒడిసిపడితే భూగర్భ జలాలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఒక్కో నిర్మాణానికి రూ.12 వేలు

శతాధిక వృద్ధురాలి మృతి



దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు వరదపురెడ్డి చెల్లయ్యమ్మ (101) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. నాలుగు తరాలను చూసిన ఈమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భర్త ముత్యాలనాయుడు గతంలోనే చనిపోయారు. కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుడు అప్పలనాయుడు, అల్లుడు అబద్ధం ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. చెల్లయ్యమ్మ అంత్యక్రియలు ఆదివారం దేవరాపల్లిలో జరిగాయి.


నాటికలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

మంచి నాటకానికి ప్రజాదరణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మంచి నాటికకు ఎప్పుడూ ప్రజాదరణ ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కర్రి రమేష్ జ్ఞాపకార్థం అనకాపల్లిలో ఆదివారం నాటి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ నాటికలను ఆదరించాలన్నారు. వచ్చిన జనం చూస్తుంటే తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ ఉత్సవ కమిటీ ఛైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, కర్రి సన్యాసినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన స్వప్నం దాల్చిన అమృతం, మూల్యం నాటికలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

ఏడుగురు ప్రయాణికులకు గాయాలు

అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందగా ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. దీనికి సంబంధించి కశింకోట సీఐ స్వామి నాయుడు కథనం ప్రకారం.. నరసాపురం నుంచి సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు 33 మంది ప్రయాణికులతో ఆదివారం రాత్రి 8.45 గంటలకు విశాఖపట్నం బయల్దేరింది. బయ్యవరం జాతీయ రహదారి వద్ద లారీ యూటర్న్ అవుతుండగా దీని వెనక ఆగి ఉన్న మరో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గుత్తిలి జగన్మోహనరావు (50) మృతి చెందారు. ఆయనతోపాటు ఏడుగురు ప్రయాణికులకు గాయాలవగా వీరికి అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించారు. వీరిలో ఒక మహిళ కాలికి బలమైన గాయమైంది. ఈమెను బంధువుల చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామినాయుడు తెలిపారు. ప్రమాద సమాచారం తెలిసిన నరసాపురం డిపో సహాయ మేనేజర్ టి. ధనలక్ష్మి, ఉద్యోగ సంఘ నాయకులు అనకాపల్లికి బయలుదేరి వచ్చారు. శవపంచనామా అనంతరం డ్రైవర్ మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తీసుకెళ్లారు. డ్రైవర్ జగన్మోహనరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు, డ్రైవర్ జగన్మోహనరావు (పాతచిత్రం)

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

సంగారెడ్డి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం శివారులో ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. అనకాపల్లికి చెందిన వీర్రాజు కుటుంబ సభ్యులతో 20 ఏళ్లుగా గడ్డపోతారంలో నివసిస్తూ.. స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి గడ్డపోతారం శివారు నుంచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వీర్రాజుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అట్టల లోడు లారీ దగ్ధం

నాతవరం, న్యూస్‌టుడే: తాండవ కూడలిలో ఆదివారం ఓ లారీ అగ్నికి ఆహుతైంది. పాత పేపర్లు, అట్టల లోడుతో వెళ్తున్న లారీని డ్రైవరు రోడ్డు పక్కన ఆపి బయటకు వెళ్లారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని లారీ దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. లారీ నర్సీపట్నంకు చెందినదని తెలిసింది.


తాండవ కూడలిలో దగ్ధమవుతున్న లారీ

ఇసుక అక్రమ రవాణా..

రెండు ట్రాక్టర్లు సీజ్

రావికమతం, న్యూస్‌టుడే: ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వి. మాడుగుల మండలం జమ్మాదేవిపేటకు చెందిన రెండు ట్రాక్టర్లలో కొత్తకోటకు ఇసుక తరలిస్తుండగా ఆదివారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసరావు చెప్పారు. దొండపూడి అటవీ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా ఇసుక లోడుతో వచ్చిన ట్రాక్టర్లను పోలీసులు ఆపారు. రవాణాకు అనుమతి పత్రాలు డ్రైవర్ల వద్ద లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 10 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **దేవర** పర్తిసాయి: **కలి** సత్యనారాయణ స్క్రీన్-1: **రామ్‌నగర్ బన్నీ** స్క్రీన్-2: **మత్తు వదలరా-2** వెంకటేశ్వర: **దక్షిణ** శ్రీ సత్య: **జెంటిల్‌మేన్** రామచంద్ర: **శ్వాగ్** షిర్డిసాయి: **సత్యం సుందరం**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **శ్వాగ్** స్క్రీన్-2: **దేవర**

తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం ఎన్నిక

అనకాపల్లి పట్టణం: అనకాపల్లి తెదేపా కార్యాలయంలో ఆదివారం తెలుగునాడు ఏపీ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య ఉద్యోగ సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులుగా పి.రామారావు, కార్యదర్శిగా శివ, కోశాధికారిగా అమ్మాజీ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు నూరుశాతం గ్రాస్ జీతం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులు, మహిళా విభాగం అధ్యక్షురాలు వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తంతడి తీర అభివృద్ధికి కృషి


తీరంలో నాయకులతో ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: గత ఐదేళ్లు దోచుకోవడం, దాచుకోవడంపైనే వైకాపా నాయకులు శ్రద్ధపెట్టారని, అభివృద్ధిని పట్టించుకోలేదని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మండిపడ్డారు. సహజసిద్ధ అందాలతో అద్భుతంగా కనిపించే తంతడి-వాడపాలెంలో కనీస సౌకర్యాలు కల్పిస్తే పర్యటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. తంతడి-వాడపాలెం తీరంలో ఆదివారం సాయంత్రం పర్యటించిన ఎమ్మెల్యే తీరాన్ని పరిశీలించి మత్స్యకారులు, నాయకులతో మాట్లాడారు. తీరాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలనే విషయంపై త్వరలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. ఈప్రాంతం పర్యటకంగా అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి లభించడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు రాజాన రమేష్‌కుమార్, రాజాన సన్యాసినాయుడు, జనపరెడ్డి నర్సింగరావు, బైలపూడి రాందాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బాణసంచా తయారీలో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అనకాపల్లిలో బాణసంచా తయారు చేస్తున్న కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామగ్రి తయారీని గమనించి నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు.


అనకాపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

తీరనున్న పాతికేళ్ల కష్టాలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం రాకతో రైలు గేట్ల సమస్య పరిష్కారం కానుంది. పట్టణంలోని పెదపల్లి రైల్వేగేటు సమీపంలో భూగర్భ వంతెన, ఏటికొప్పాక వద్ద పైవంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండింటిని పరిష్కరించడానికి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ముందుకు వచ్చారు. ఎంపీ సీఎం రమేశ్ సహకారంతో రైల్వే అధికారులతో మాట్లాడారు. ఈ రెండు చోట్ల నిర్మాణాలకు అధికారులను ఒప్పించారు. రైల్వే ఇంజినీరింగ్ ఉన్నతాధికారులను ఇక్కడి రప్పించి స్థల పరిశీలన పూర్తి చేశారు. దీంతో పాతికేళ్లనాటి రైల్వేగేటు కష్టాలు తీరనున్నాయి.


ఏటికొప్పాక రైల్వేగేటు

ఎలమంచిలి ప్రజలకు పెదపల్లి రైల్వేగేటు పెద్ద సమస్యగా మారింది. స్టేషన్ పక్కనే ఈ గేటు ఉన్న కారణంగా రైలు రాకముందే గేటు మూసివేస్తారు. ఈ స్టేషన్ నుంచి ఆ రైలు గేటు దాటేవరకూ దీన్ని తెరవరు. ఈ కారణంగా ఇక్కడ గేటు పడితే తెరవడానికి 20 నిమిషాలు పైనే పడుతోంది. ఈలోగా పక్కమార్గంలో మరో రైలు వస్తే గేటు అరగంటకు పైగా మూసి వేస్తున్నారు. ఎలమంచిలి నుంచి రాంనగర్, పెదపల్లి, గొల్లలపాలెం, ఎర్రవరం పరిసర గ్రామాలకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాలి. రోజూ మూడు నుంచి నాలుగు వేల వరకూ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి.

ఏటికొప్పాక రైల్వేగేటు సమస్య చాలా కాలంగా నలుగుతోంది. జగన్ పాలనలో పైవంతెన నిర్మిస్తామని చెప్పినా కనీసం అధికారుల పరిశీలన కూడా చేయలేదు. కూటమి వచ్చాక అధికారులు పరిశీలించారు. ఇది పూర్తయితే ఏటికొప్పాక గ్రామానికి రాకపోకలు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోతాయి. ఇక్కడ గేటు వేస్తే తీయడానికి చాలా సమయం పడుతుంది. ఎలమంచిలి నుంచి దార్లపూడి, నర్సీపట్నం ప్రాంతాలకు వెళ్లే వారు. ఈ గేటు మీదుగా ప్రయాణించాలి. దీనికి భయపడి ఈ మార్గంలో రావడం మానేసి చుట్టూ తిరిగి అడ్డరోడ్డు మీదుగా వెళుతున్నారు. ఈరెండు గేట్ల సమస్య అధికారులతో మాట్లాడి ఒప్పించామని త్వరలో పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చెప్పారు.

పేదలకు నీడను కల్పించడమే లక్ష్యం


తాతయ్యబాబును సన్మానిస్తున్న మాజీ ఎంపీ పప్పల, నానాజీ తదితరులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పేదలందరికీ నీడను కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గృహనిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఎలమంచిలి తెదేపా కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయనను మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, పట్టణ అధ్యక్షులు గొర్లె నానాజీ తదితరులు తాతయ్యబాబును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లల్లో అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు. పేదలకు పింఛన్లు, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆదర్శ రాష్ట్రంగా సీఎం చంద్రబాబు తీర్చిదిద్దుతామన్నారు. నాయకులు ఆడారి రమణబాబు, ఆడారి ఆదిమూర్తి, కరణం రవికుమార్, దూలి రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అనధికార మార్గాలు

ఎలమంచిలి, కశింకోట, న్యూస్‌టుడే: అనకాపల్లి-పాయకరావుపేట మధ్య అనధికార మార్గాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వైకాపా పాలనలో నాయకుల ఒత్తిడితో రోడ్డు మధ్యలో ఉన్న కాంక్రీట్ డివైడర్లను తవ్వించి మార్గాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇవి వారికి సౌకర్యవంతంగా ఉన్నా జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి ప్రాణ సంకటంగా మారాయి. బయ్యవరం పెట్రోల్ బంక్ ఎదురుగా మార్గం ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పోలీసులు పట్టించుకోవటంలేదు. పినిరెడ్డి సమీపాన కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఎలమంచిలి సమీపంలోని జాతీయ రహదారిపై కొక్కిరాపల్లి, పెదపల్లి, వద్ద ఉన్న అనధికార డివైడర్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని గతంలో మూయించి వేశారు. ఇదే తరహాలో పోలీసులు అనధికార మార్గాలను మూయించాలని స్థానికులు కోరుతున్నారు.


అనధికార మార్గంలో రాకపోకలు

ఎస్.రాయవరంలో ముగిసిన శిక్షణ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరంలో ఆర్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో యువతకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ ఆదివారంతో ముగిసింది. శిక్షణలో నేర్చిన అంశాలను యువత సమాజాభివృద్ధికి వినియోగించాలని తీరుపై ప్రతినిధులు సీహెచ్ ప్రసాద్, పి. చిట్టిబాబు వివరించారు.

చురుకుగా రహదారి నిర్మాణం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి-విశాఖ రోడ్డులో జలగలమదుం వద్ద రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను 84వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలిబాబు ఆదివారం పరిశీలించారు. ఇవి ఎమ్మెల్యే కొణతాల కృషితో జరుగుతున్నాయన్నారు.

రోడ్లు భవనాలశాఖ డీఈగా రాధాకృష్ణ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రోడ్లుభవనాల శాఖ ఎలమంచిలి డివిజన్ డీఈగా రాధాకృష్ణ విధుల్లో చేరారు. ఈయన విజయనగరం జిల్లా భోగాపురం డివిజన్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి మాతృవియోగం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దిబ్బపాలెం సెజ్ కాలనీ ఎంపీటీసీ సభ్యుడు నీరుకొండ నర్సింగరావు తల్లి నీరుకొండ అప్పనర్సమ్మ (87) ఆదివారం మృతి చెందారు. తెదేపా వ్యవస్థాపన నుంచి పార్టీకి అండగా ఆమె నిలిచారని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

గ్రామాభివృద్ధికి సేవలు మరువలేనివి

మునగపాక: జిల్లా తెదేపా మాజీ అధ్యక్షుడు పెంటకోట జనరాజ్‌దాస్ మునగపాక అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని పలువురు వక్తలు అన్నారు. మునగపాకలో జనరాజ్‌దాస్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: తుమ్మపాలలో పందులు, కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. వీధుల్లో ఇవి ఎక్కువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
– వేణుగోపాల్, తుమ్మపాల

సమాధానం: పందులు, కుక్కల సంచారం అరికట్టి సమస్యను పరిష్కరిస్తాం.
– ఈశ్వరరావు, తుమ్మపాల పంచాయతీ కార్యదర్శి

కనకదుర్గకు కుంకుమ పూజలు


లలిత త్రిపురసుందరీదేవి అలంకరణలో


అనకాపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి పట్టణం, లక్ష్మీదేవిపేట, నెహ్రూచౌక్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ ఉత్సవమూర్తికి 108 కలశాలతో పంచామృతాలతో అభిషేకం చేశారు. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఎన్.సుజాత, గౌరీ వ్యాయామశాల అధ్యక్షులు దాడి జయవీర్ పాల్గొన్నారు. అనకాపల్లి సతకంపట్టు వద్ద కనకదుర్గ అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. విద్యార్థినులు నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో దుర్గాదేవి మీనాక్షి అలంకరణలో దర్శనమిచ్చారు. యాగశాలలో మోదక హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. లక్ష్మీదేవిపేట కనకదుర్గాదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అన్నంతో అభిషేకం నిర్వహించారు. మహిళలకు కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. గవరపాలెం శ్రీగౌరీ పంచాయతన దేవాలయంలో కుమ్మరిశ్వేరిగా పూజలు అందుకున్నారు. శ్రీకామాక్షిదేవి రాజరాజేశ్వరిగా సామూహిక కుంకుమ పూజలు అందుకున్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోటిపల్లి శ్రీను, ప్రతినిధులు సతీష్, ధవలేశ్వరం, మత్స్యరి గంగారావు, కోటిపల్లి జిజిబాబు, కొమ్మోజు గోవిందరాజు, పొన్నాడ వెంకటరమణాచారి, శ్రీను పాల్గొన్నారు.


ఎలమంచిలిలో...

ఎలమంచిలి, అచ్యుతాపురం, మునగపాక, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఎలమంచిలి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని లలితా దేవి రూపంలో అలంకరించారు. హరిపాలెం భవానీ భక్తులతో సందడిగా మారింది. మునగపాక లింగరాయ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. సంతబయల వీరంలో భవానీ భక్తులు అంబలం పూజ నిర్వహించారు. కాశిత ఆలయంలో గోపూజ భక్తి శ్రద్ధలతో సాగింది. అమ్మవారికి లలితా త్రిపుర సుందరీదేవి అలంకరించారు.


నూకాలమ్మ ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకాలు


భరత నాట్య ప్రదర్శన

నేడు నీటి సరఫరా బంద్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో యర్రవరంలో తాగునీటి పైపులైను దెబ్బతినడం వల్ల సోమవారం 4వ వార్డు నుంచి 11 వార్డు వరకు, 24, 25 వార్డులకు తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. దెబ్బతిన్న చోట పైపులైనుకు మరమ్మతులు చేస్తున్నామన్నారు. ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని వివరించారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

80 మంది కంటి రోగులకు పరీక్షలు

మునగపాక, రాంబిల్లి, న్యూస్‌టుడే: మునగపాక పంచాయతీ కార్యాలయంలో కంటి వైద్యులు ఆదివారం 80 మంది రోగులను పరీక్షించారు. ఈ శిబిరాన్ని సర్పంచి దిమ్మల అప్పారావు ప్రారంభించారు. వైద్యులు ఎన్.నాగేశ్వరరావు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మామిడివాడ శివారు నారాయణపురంలో హోమియో ఉచిత వైద్య శిబిరాన్ని విశ్రాంత విద్యాశాఖాధికారి సీహెచ్.వి.రాజు, ఎస్.సత్యనారాయణ ప్రారంభించారు. 55 రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

శూలాల ఉత్సవాన్ని జయప్రదం చేయండి


ప్రగడకు ఆహ్వానపత్రికను అందిస్తున్న ప్రతినిధులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజున హరిపాలెం-అందలాపల్లిలోని శ్రీభగిరధీ అమ్మవారికి నిర్వహించే శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసిన్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శ్రీభగిరధీ అమ్మవారి మాలలు ధరించి 140 మంది భక్తులు బుగ్గ, గంప, పందిరి శూలాలు ధరిస్తారన్నారు. ఈ ఉత్సవానికి హాజరు కావాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావుతోపాటు పలువురు నాయకులను ఆహ్వానించినట్లు తెలిపారు. కమిటీ ప్రతినిధులు భీశెట్టి గణేష్, సూరిశెట్టి గాంధీ, వెంకటఅప్పారావు, కాండ్రేగులు జగదీష్, బుద్ధ నాగేశ్వరరావు, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ సన్నిధిలో 16 నుంచి బిక్ష

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ సన్నిధిలో మాలధారణ భక్తులకు ఈనెల 16 నుంచి బిక్ష ఏర్పాటుచేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మొల్లేటి సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ మాల ధరించే భక్తులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. నాయకులు బొడ్డేడ ప్రసాదు, దాడి ముసలినాయుడు, ఆడారి గణపతి అచ్చింనాయుడు, సూరిశెట్టి కన్నారావు, పెంటకోట ఉమేష్, పొన్నా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ

సప్పరంపై ఊరేగిన వెంకన్న

నక్కపల్లి, న్యూస్‌టుడే: నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక వెంకన్న ఆదివారం తిరువీధుల్లో ఊరేగారు. ముందుగా ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు ఉత్సవమూర్తులకు విశేష పూజలు జరిపి, ప్రసాద నివేదనలు చేశారు. సుదర్శన పెరుమాళ్‌ను పల్లకీలో ఉంచి గ్రామ బలిహరణ చేపట్టారు. తర్వాత సతీసమేతుడైన స్వామివారిని సప్పర వాహనంలో అలంకరించి మేళ తాళాలతో తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవింద నామస్మరణ నడుమ దర్శనాలు చేసుకున్నారు. గోదాదేవికి లక్ష్మీ అష్టోత్తర సహస్రనామ పూజలు చేశారు. తితిదే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి ఊరేగింపు

మొక్కల సంరక్షణ బాధ్యత కాలనీ సభ్యులదే!

అనకాపల్లి, న్యూస్‌టుడే: గవరపాలెం నందనవనం ప్రాంతంలో ఆదివారం కాలనీ వాసులతో కలిసి గ్రీన్‌క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. వీటిని సంరక్షణ బాధ్యతను కాలనీ సంఘ సభ్యులు తీసుకున్నారు. క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, కాలనీ అధ్యక్షులు పొలిమేరశెట్టి వెంకట్, కార్యదర్శి కర్రి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



మొక్కలతో గ్రీన్ క్లబ్ సభ్యులు

ఇతిహాసాలపై పరిజ్ఞానం తప్పనిసరి

నెహ్రూచౌక్ (అనకాపల్లి): ఇతిహాసాలపై విద్యార్థులు పరిజ్ఞానం పెంచుకోవాలని తెలుగుభాషా పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ కొయిలాడ రామ్మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలో తెలుగుభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రామాయణం, మహాభారతం మన దేశ సనాతనధర్మానికి మూలాలని ఆయన వెల్లడించారు. విజేతలకు ఈనెల 15న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. సమితి సభ్యులు జి.రంగబాబు, తమ్మిరాజు, మాధవిసనారా, అమరజ్యోతి, కోరాడ అప్పలరాజు, కామేశ్వరరావు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆధ్యాత్మిక తోవ.. అన్నదానంతో సేవ

కాలానికి అనుగుణంగా మార్పులు సహజమే అయినా.. సంప్రదాయాలను అందిపుచ్చుకోవడంలో ప్రస్తుత జనం ముందుంటున్నారు. ప్రధానంగా ఆధ్యాత్మిక పరమైన అంశాల్లో మంచి మార్పులు వస్తుండగా, చాలాచోట్ల మానవసేవే.. మాధవసేవ అనే సూక్తిని పాటిస్తూ పండగలు, పర్వదినాల్లో పలు చోట్ల ఉచిత అన్నదానంలో ఉత్సవ కమిటీలు నిమగ్నమవుతున్నాయి.

నక్కపల్లి, న్యూస్‌టుడే

నక్కపల్లి మండలంలో గణపతి నవరాత్రులు, దసరా వేడుకల్లో అన్నదానాలు భారీఎత్తున చేపడుతున్నారు. ఇందులో ఉద్దండపురం గ్రామానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ దుర్గమ్మతో పాటు పలు అమ్మవార్ల ఆలయాలున్నాయి. ఏళ్ల తరబడి ఏటా శరన్నవరాత్రి వేడుకల తొమ్మిది రోజుల పాటు గ్రామంలో ఈ ప్రాంతంలోనే నిత్యాన్నదానం చేస్తుంటారు. ఇదే కోవలో ఇప్పుడు నక్కపల్లి అడుగు పెట్టింది. ఇక్కడా ప్రస్తుతం వందల మంది భవానీ భక్తులకు రోజూ ఉచిత బిక్ష ఏర్పాటు చేస్తున్నారు. ఉద్దండపురంలో భవానీలకు బిక్షతో పాటు, సాయంత్రం వడి ఏర్పాటు చేస్తున్నారు. ఇక మధ్యాహ్నం వేళల్లో భవానీ భక్తులతో పాటు సాధారణ ప్రజలకు కలిపి వేల మందికి ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. రోజూ ఉద్దండపురంలోని ఆలయాల ప్రాంతం అన్నదానంతో కళకళలాడుతోంది. ఇక్కడకు స్థానికులే కాకుండా, చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు వస్తుంటారు. దీనికితోడు తొమ్మిది రోజుల వేడుకల్లో ఎవరు అన్నదానం చేయడానికి ముందుకు వచ్చారో వారి వివరాలను బోర్డుపై రాసి అందరికీ తెలిసేలా పెట్టారు.


నక్కపల్లి మండపంలో బిక్ష చేస్తున్న భవానీలు

ఏటా ఉచితంగానే



భవానీ మాల వేసుకున్న స్థానికులే కాకుండా, చుట్టుపక్కల వారు ఇక్కడ ఏర్పాటు చేసే బిక్షకు వస్తుంటారు. గ్రామం జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో వాహనాల్లో వెళ్లే వారు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుంటారు. చాలా ఏళ్లగా ఈ కార్యక్రమం ఉచితంగానే చేస్తున్నారు.
– పి.శ్రీను, పి.వీరబాబు, భవానీ భక్తులు, ఉద్దండపురం

పండగలా సాగుతుంది



మా గ్రామంలో గణపతి నవరాత్రుల సమయంలో దాదాపు ప్రతి మండపం పరిధిలోనూ అన్నదానం చేస్తారు. దేవీ నవరాత్రుల్లో గ్రామ ఆలయం వద్ద తొమ్మిది రోజులూ నిత్యాన్నదానం సాగుతుంది. ఇదంతా పెద్ద పండగలా ఉంటుంది. మాగ్రామంలో ఇలాంటి కార్యక్రమం ఏటా చేయడం ఆనందంగా ఉంది. – కె.వరలక్ష్మి, జి.చక్రమ్మ, ఉద్దండపురం

దాతల సాయంతోనే

నవరాత్రుల సమయంలో ఇక్కడ అన్నదానం మొదలై రెండు దశాబ్దాలు కావస్తోంది. నిర్విరామంగా ఈ కార్యక్రమం సాగడానికి దాతల సహకారమే కారణం. ముందుగానే అన్నదానం చేయడానికి పేర్లు నమోదు చేసుకుంటారు. దాతలు రాకపోతే కమిటీ నిధులతో చేపడతాం. కార్తీక మాసంలో అయ్యప్ప మాల ధారులకు ఉచిత బిక్ష ఉంటుంది.
– పొడగట్ల రమణ, ఆలయ కమిటీ ఛైర్మన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక జడ్పీ పాఠశాలలో 1979-80లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మునగపాక పరదేశిమాంబ ఆలయ ప్రాంగణంలో భేటీ అయ్యారు. విశాఖపట్నం, హైదరాబాద్, మునగపాక చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ ఆదివారం ఉదయమే పరదేశిమాంబ ఆలయప్రాంగణానికి చేరుకుని నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అందరూ మధ్యాహ్నం భోజనాలు చేశారు. సూరిశెట్టి శ్రీనివాస్, జనపరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, ఆడారి నాగేశ్వరరావు, పెంటకోట నాగ అప్పారావు, దాడి సాంబమూర్తి, బుద్ధ వెంకరామ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు

కోటవురట్ల, న్యూస్‌టుడే: గిరిజన యువకులు క్రీడల్లో రాణించాలని తెదేపా సీనియర్ నాయకులు సుంకర బాబ్జీ అన్నారు. గొట్టివాడ శివారు అణుకు గ్రామానికి వెళ్లిన ఆయన గ్రామ పెద్దలతో కలిసి అక్కడి యువకులకు వాలీబాల్ కిట్టు అందించారు. చదువుతోపాటు, క్రీడల్లోనూ రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఎక్కువ ఉంటాయని చెప్పారు.


వాలీబాల్ కిట్ అందిస్తున్న బాబ్జీ

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తిమ్మరాజుపేట వద్ద భారీ వృక్షం నేలకూలింది. ఎటువంటి గాలలు, వర్షాలు లేకపోయినా ఆదివారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వృక్షం నేలకూలింది. చెట్టు కూలిపోతున్న సమయంలో కొబ్బరి బొండాల విక్రయదారులు అప్పారావు, వెంకటి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆడారి రామకృష్ణ ఆధ్వర్యంలో యువకులే చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. దీనిని పూర్తిగా తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.


తిమ్మరాజుపేట వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

కుక్క, కోతి కొట్లాట



క్లిక్ క్లిక్

నర్సీపట్నం సబ్ కలెక్టరేట్ ఆవరణను కోతులు, కుక్కలు ఆవాసంగా చేసుకున్నాయి. కొబ్బరి, మామిడి చెట్లపై, కార్యాలయ పైకప్పుపై కోతులు గెంతుతున్నాయి. ఆహారం కోసం కిందకు దిగితే వాటిని కుక్కలు తరుముకున్నాయి. రెండు కుక్కలు, ఒక కోతి ఆదివారం ఆహారం విషయమై కొట్లాడుకున్నాయి. కుక్కలు వెంటపడగా వాటి నుంచి తప్పించుకుని కోతి చెట్టెక్కేసింది. ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

వడ్డాది సంతకు పండగ శోభ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాదిలో ఆదివారం జరిగిన సంత దసరా కళను సంతరించుకుంది. ప్రతి ఆదివారం ఇక్కడ పెద్ద సంత జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచి కొనుగోలుదారులు, వ్యాపారులు వస్తారు. ఈ వారం దసరా ముందు సంతకావడంతో రద్దీ నెలకొంది. నాటుకోళ్లు, పొట్టేళ్ల అమ్మకాలు భారీగా జరిగాయి.



నాటుకోళ్ల అమ్మకాలు

చోడవరమా.. శాపమా?

దశాబ్దాలుగా పరిష్కారానికి నోచని సమస్యలు

పట్టణ అభివృద్ధిపై దృష్టిసారించని పాలకులు

నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చోడవరం అభివృద్ధిలో అట్టడుగున నిలుస్తోంది. ఐదేళ్లకోసారి పాలకులు మారుతున్నా దశాబ్దాలుగా సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. ఏటికేడు పట్టణ పరిధి పెరుగుతున్నా.. మౌలిక వసతుల కల్పన మృగ్యంగా మారుతోంది. వర్షం కురిస్తే మురుగు నీరు ముంచెత్తుతోంది. జనావాసాల్లోకి నీరు చేరుతోంది. అందరికీ రక్షిత తాగునీరు సరఫరా, మెరుగైన పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణలో అడుగడుగునా వైఫల్యాలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

చోడవరం, న్యూస్‌టుడే

'మారుమూల గ్రామాలూ అభివృద్ధి చెందుతున్నాయి. చోడవరం పదేళ్ల కిందట ఎలా ఉందో.. ఇప్పటికీ అలాగే ఉంది. ఏమాత్రం మార్పు లేదని తెలంగాణలో స్థిరపడి దసరా సెలవులకు వచ్చిన వారు స్థానికులతో అన్న మాటలివి. వారే కాదు.. గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లి.. కొన్నేళ్లకు పదోన్నతిపై మళ్లీ ఇక్కడకు వచ్చిన అధికారులూ ఇదే అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం.

"భీమునిపట్నం - నర్సీపట్నం (బీఎన్) రోడ్డు చోడవరం పట్టణ పరిధిలో 2.4 కి.మీ. ఉంది. చోడవరం జనాభా సుమారు 17 వేలు. 137 కార్లు, 5,123 బైకులు, స్కూటీలు, 928 ఆటోలున్నాయి. వీటితోపాటు పాడేరు - విశాఖ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలతో బీఎన్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అనకాపల్లి, విశాఖ, నర్సీపట్నం, పాడేరు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు వందకుపైగా చోడవరం మీదుగానే వెళ్తుంటాయి. ఐదు నిమిషాలకో బస్సు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వస్తుంటుంది. చోడవరం నుంచి విశాఖ, నర్సీపట్నంకు గంటకొక్కటి, పాడేరుకు 2.30 గంటలకో బస్సు ఉంది."

"నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే బీఎన్ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాదిలో జరిగిన ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా.. 29 మంది గాయపడ్డారు. గోవాడకు చెందిన లక్ష్మణ్ బైక్‌పై వెళ్తూ కొత్తూరు కూడలిలో ప్రమాదానికి గురయ్యారు. కుడి చేతికి వాపు రావడంతో నాలుగు రోజుల తర్వాత వైద్యుడ్ని సంప్రదించారు. ఎక్స్‌రే తీయించగా.. చిటికెన వేలి జాయింట్‌లో గాలి పగుళ్లు ఉన్నట్లు తేలింది. మూడు వారాలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యుడు చెప్పడంతో ఇంటికే పరిమితమయ్యారు. పెందుర్తి మండలం పినగాడికి చెందిన దంపతులు చీడికాడ మండలంలో బంధువుల ఇంట శుభకార్యానికి హాజరై బైక్‌పై తిరిగివెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు."



రాత్రంతా అంధకారమే..

వీధి దీపాల నిర్వహణకు పంచాయతీ ఏటా పది లక్షలకుపైగా బడ్జెట్ కేటాయిస్తోంది. వార్డులతోపాటు బీఎన్ రోడ్డులో దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. కొద్ది వారాలుగా బీఎన్ రోడ్డు పొడవునా దీపాలు వెలగక అంధకారం అలుముకుంటోంది. కొత్తూరు కూడలి, వినాయకుడి గుడి, పాత బస్టాండు తదితర చోట్ల హైమాస్ట్ దీపాలు వెలగడం లేదు. దారంతా గోతులు ఉండటం, చీకట్లో దగ్గరకు వచ్చే వరకు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

రోడ్డు పొడవునా ఇసుక, మట్టి

నాలుగు రోడ్ల కూడలిగా ఉన్న కొత్తూరు వద్ద ఎన్నికలకు ముందు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఉన్న రహదారికి అడుగు ఎత్తులో నిర్మించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పెట్రోల్ బంకు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రహదారి మధ్యలో అడుగు ఎత్తున డివైడర్లు ఉన్నాయి. వాహనాలు, ఇసుక ట్రాక్టర్లు, లారీల రాకపోకలతో పెద్ద ఎత్తున మట్టి, ఇసుక పేరుకుపోతోంది. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తీసుకువెళ్లడానికే పరిమితమవుతున్నారు. రోడ్డును ఊడ్చడం, మట్టి, ఇసుకను తొలగించడం చేయడం లేదు. ఫలితంగా బస్సులు, లారీలు వెళ్లే సమయంలో దుమ్ము, ధూళి లేస్తోంది. కళ్లలో దుమ్ము పడి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కనున్న దుకాణాలు దుమ్ముకొట్టుకుపోతున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంటకోసారి శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. కొత్తూరు కూడలిలో ఓ బేకరీ యజమాని ఊపిరితిత్తుల సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. దుమ్ము వల్ల ఆయన దుకాణానికి రావడం పూర్తిగా తగ్గించేశారు.



రోడ్డు పక్కన పేరుకుపోయిన ఇసుక, మట్టి

ఎన్‌డీబీ నిధులతో అభివృద్ధి



ప్రణాళికాయుతంగా పట్టణ అభివృద్ధికి దృష్టిసారిస్తాం. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలో ఆగిపోయాయి. రైతుబజారు, తహసీల్దారు కార్యాలయం, ప్రధాన రహదారి విస్తరణ, కోర్టు భవనాలను పూర్తి చేయడమే లక్ష్యం. ప్రధాన రహదారి అభివృద్ధికి ఎన్‌డీబీ నిధులున్నాయి. బీఎన్ రహదారి విస్తరణ ప్రతిపాదన కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ వద్ద ఉంది. రహదారి మధ్యలో ఇసుక, మట్టి తొలగింపునకు సంబంధిత అధికారులను ఆదేశిస్తా. – కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్యే

పల్లె దారులకు మహర్దశ

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

నియోజకవర్గంలోని 86 పంచాయతీల్లో 173 రోడ్లకు రూ.12.10 కోట్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో వీటిని అభివృద్ధి చేయనున్నారు. కొన్నిచోట్ల సిమెంటు కాలువలు నిర్మించనున్నారు. నాతవరం మండలం వెదురుపల్లి రహదారికి రూ.60 లక్షలు కేటాయించారు. గొలుగొండపేట తారురోడ్డుకు మరమ్మతు చేయనున్నారు. ఆర్పీ అగ్రహారం నుంచి ఉప్పరగూడేనికి రూ.70 లక్షలతో తారురోడ్డు వేయనున్నారు. తాళ్లపాలెం - వడపర్తి మధ్య రూ.1.4 కోట్లతో 2.2 కి.మీ. దూరం కొత్తగా రోడ్డు నిర్మించనున్నారు. వైబీ అగ్రహారం - అల్లిపూడి రోడ్డుకు రూ.1.4 కోట్లు కేటాయించారు. నర్సీపట్నం మండలం గబ్బాడ ఆంజనేయస్వామి విగ్రహం నుంచి సబ్ స్టేషన్ వరకు ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డుని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. వేములపూడిలో కుమ్మరి వీధి నుంచి గాంధీ బొమ్మ వరకు సీసీ రోడ్డు వేయనున్నారు. నిధుల్లో అత్యధికంగా నాతవరం మండలానికి రూ.5.24 కోట్లు, గొలుగొండ మండలానికి రూ.2.86 కోట్లు, మాకవరపాలెం మండలానికి రూ.2.14 కోట్లు, నర్సీపట్నం మండలానికి రూ.1.75 కోట్లు కేటాయించారు. ఈ నెల 14 నుంచి 24 వరకు పనులను ప్రారంభించనున్నారు.



గబ్బాడ రోడ్డు

మురుగు కాలువలకు మోక్షం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ ఖాతాలకు ఆర్థిక సంఘం నిధులు జమ కావడంతో పల్లెల్లో గడిచిన ఐదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలపై సర్పంచులు దృష్టిసారించారు. మేజర్ పంచాయతీ వేములపూడితోపాటు శివారు గ్రామాలైన అప్పన్నపాలెం, చిటికెలూరు, పెద ఉప్పరగూడెం, బంగారయ్యపేట, బుచ్చన్నపాలెంలో మురుగు కాలువల్లో పూడిక తీయిస్తున్నారు. ఈ పంచాయతీకి రూ.8.5 లక్షలు మంజూరు కాగా రూ.4.5 లక్షలు పూడికతీత పనులకు కేటాయించినట్లు ఈవో బంగారు సత్యనారాయణ చెప్పారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

గొలుగొండ, న్యూస్‌టుడే: ఇక్కడ సచివాలయం దరిలో నివాసం ఉంటున్న పది కుటుంబాల వారు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కొత్త ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయడంతో ఈ ప్రదేశంలో చేతిపంపు ఏర్పాటుకు పాలకవర్గం ముందుకొచ్చింది. సర్పంచి అప్పారావుతోపాటు వార్డు సభ్యులు ఆదివారం ఈ పనులు ప్రారంభించారు. కూటమి నేతలు రాము, లోవ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **జోకర్ ఫోలి అడు, కలి, సత్యం సుందరం,** ఆడి2: **స్వాగ్** ఆడి3: **దేవర,** ఆడి4: **దేవర, సత్యం సుందరం** రాజు:**శ్వాగ్,** బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం,** సాయిలక్ష్మి: **శ్వాగ్,** పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

విద్యుత్తు డీఈఈగా త్రినాథ్‌రావు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ డీఈఈగా కె.వి.త్రినాథ్‌రావు నియమితులయ్యారు. మర్కాపురం నుంచి బదిలీపై వచ్చి ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎ.సత్యానందం విశాఖలోని కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

భగవద్గీత పఠనంతో శాంతియుత జీవనం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: శాంతియుత జీవనానికి భగవద్గీత పఠనం ఉపకరిస్తుందని సేవకులు పేర్కొన్నారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు యరకన్నపాలెం, పాములవాక గ్రామాల్లో ఆదివారం గీతపై ఇంటింటి ప్రచారం చేశారు. హిందూ జ్ఞాన వేదిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భజనలతో భక్తిభావం పెంపు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: నిత్యం భజనలు చేయడం ద్వారా భక్తిభావం పెంపొందుతుందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. బాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా మేడిచర్లలో భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన కార్యక్రమం జరిగింది. పూడి నారాయణమూర్తి, పది గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కంటి శిబిరానికి స్పందన

కె.కోటపాడు, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సంయుక్తంగా కె.కోటపాడులో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించాయి. వైద్యులు రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. ఆనందరావు, రాంబాబు, రమణాజీ, హరిచందన పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై విద్యార్థుల ఆసక్తి

గొలుగొండ, న్యూస్‌టుడే: ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడంపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని గ్రంథాలయాధికారి రాజుబాబు చెప్పారు. 'చదవడం మాకు ఇష్టం' కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందన్నారు. దిన, వార పత్రికలతోపాటు కథలు పుస్తకాలు చదువుతున్నారని పేర్కొన్నారు.

బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

గొలుగొండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాల తొలగింపుపై పోలీసులు దృష్టిసారించాలని మహిళా సంఘం మండల అధ్యక్షురాలు భవాని ఆదివారం డిమాండ్ చేశారు. ఒక్కో పంచాయతీలో ఎన్ని బెల్టుషాపులున్నాయో నిర్వాహకుల పేర్లతో వివరాలు ఇచ్చేందుకు సిద్ధం ఉన్నామన్నారు.

గ్రామ సింహాల దూకుడుకు కళ్లెం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

గుంపులుగా సంచరిస్తూ వాహన చోదకులు, ఒంటరిగా నడిచి వెళ్తున్న వారి వెంటపడుతూ భయాందోళనకు గురిచేస్తున్న గ్రామ సింహాల దూకుడుకు కళ్లెం వేసేందుకు పశుసంవర్ధక, మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. కుక్క కాటు కేసులు నమోదవుతున్న నేపథ్యంలో పక్కా కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. వాటి సంతతి పెరగకుండా శస్త్రచికిత్సలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ముందుగా పెంపుడు కుక్కలతోపాటు వీధుల్లో తిరిగే వాటిని పట్టుకుని రేబీస్ టీకాలు వేస్తున్నారు. నర్సీపట్నంలో సుమారు రెండు వేల కుక్కలు ఉన్నట్లు అంచనా. పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల్లో తిరుగుతూ స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లోనూ తరచూ కుక్కల సమస్యపైనే కౌన్సిలర్లు లేవనెత్తుతూ అధికారులను నిలదీస్తున్నారు. కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న సురేంద్ర కుక్కలతోపాటు పందుల సమస్య పరిష్కారానికి చర్యలను ముమ్మరం చేశారు. ఇందుకోసం రూ.7.5 లక్షలు కేటాయించారు. సామర్లకోట నుంచి కుక్కలు పట్టడంలో నైపుణ్యం ఉన్న వారిని తీసుకువచ్చారు. వీరు వలలతో వీధి కుక్కలను పట్టుకుంటున్నారు. పశువైద్య సిబ్బంది ఇప్పటివరకు 300 శునకాలకు రేబీస్ టీకాలు వేశారు. 40 రోజుల్లో శస్త్రచికిత్సలు పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్‌ను సిద్ధం చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రాంబాబు పేర్కొన్నారు. పందుల పెంపకందారులకు నోటీసులు జారీ చేశారు.



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

కాలుష్య కాసారాలు

గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

సాగు, తాగునీటి వనరులు వ్యర్థాలతో కలుషితమవుతున్నాయి. నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో 216.83 ఎకరాల విస్తీర్ణంలోని ఐదు చెరువుల కింద 800.20 ఎకరాల ఆయకట్టు, పంచాయతీరాజ్ శాఖ నుంచి జలవనరుల శాఖకు బదిలీ అయిన 11 చెరువుల కింద 287.19 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో 121.04 ఎకరాల విస్తీర్ణంలోని పెద్ద చెరువు సగానికిపైగా గుర్రపు డెక్కతో నిండిపోయింది. చుట్టుపక్కల ఆవాసాలు పెరగడంతో మురుగు నీరంతా చెరువులోకి చేరుతోంది. ఇళ్లలో పోగయ్యే వ్యర్థాలను స్థానికులు చెరువులోనే పడేస్తున్నారు. నర్సీపట్నం - బలిఘట్టం మధ్యనున్న పెద్ద చెరువును హైదరాబాద్‌లోని ట్యాంకు బండ్ తరహాలో అభివృద్ధి చేసేందుకు 2018లో అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు రూ.6.15 కోట్లు కేటాయించారు. రూ.3 కోట్లు ఖర్చు చేసి గట్టును బలోపేతం చేసి రోడ్డును విస్తరించారు. పైపులైన్ పనులు కొంతమేర చేపట్టారు. వైకాపా ప్రభుత్వం ఆ పనులను కొనసాగించలేదు. ఏడాదిన్నర కిందట రూ.1.72 కోట్లతో వాకింగ్ ట్రాక్, ఉద్యానం, విద్యుదీకరణ పనులు చేపట్టాలని ప్రతిపాదించినా పట్టాలెక్కలేదు. కూటమి ప్రభుత్వంలో ఈ చెరువు రూపురేఖలను మార్చాలని శాసన సభాపతి యోచిస్తున్నారు.



పెద్ద చెరువులో వ్యర్థాలు



చెరువు గర్భంలో ఆక్రమణలు

చెరువు గర్భంలో ఆక్రమణలు

పెదబొడ్డేపల్లి పెద్దచెరువు గర్భంలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. కొందరు చెరువును ఆక్రమించి పందుల కోసం షెడ్లను ఏర్పాటు చేశారు. ఈ చెరువు పక్కగా ఇటీవల కొత్తగా రోడ్డు నిర్మాణం జరిగింది. విగ్రహాలు పెట్టిన చోట రక్షణగోడ నిర్మించలేదు. తెదేపా అధికారంలో ఉన్నప్పుడు చెరువు గట్టును వాకింగ్ ట్రాక్‌గా మార్చాలని భావించారు. రూ.లక్షల వ్యయంతో గట్టును విస్తరించారు. అనకాపల్లి రోడ్డులో మాజీ ఎమ్మెల్యే గణేష్ ఇంటికి సమీపంలోని చెరువు ఒడ్డున, శ్మశానం ప్రాంతంలో వ్యర్థాలు పోగుపడుతున్నాయి. ఈ విషయాన్ని జలవనరుల శాఖ ఏఈఈ రామన్నపాత్రుడి దృష్టికి తీసుకువెళ్లగా.. చెరువులోల వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాయనున్నట్లు చెప్పారు.

లలితా త్రిపుర సుందరిగా దర్శనం



ఏఎల్‌పురంలో ఆలయంలో సామూహిక కుంకుమ పూజలో మహిళలు

నర్సీపట్నం/అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంతమంతా భవానీలతో కిటకిటలాడింది. సహస్రనామార్చనలు, సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. బలిఘట్టంలో వరాహ నది ఒడ్డునున్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరిగా అలంకరించారు. ఉదయం సువాసిని పూజలు, సూర్య నమస్కారాలు, సాయంత్రం హోమం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భవానీలకు భిక్ష, చతుర్వేది స్వస్తి, దర్బారు సేవ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



లలితా త్రిపుర సుందరి అలంకరణ

కృష్ణదేవిపేట: చోద్యంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అగ్ని గుండం నిర్వహించారు. మధ్యాహ్నం భవానీలకు అన్నసమారాధన చేశారు. ఏఎల్‌పురం ఆలయంలో 108 మంది దంపతులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. కొత్తమల్లంపేట, అమ్మపేట, చిన్నయ్యపాలెం గ్రామాల్లో పడి పూజలు కొనసాగాయి.

రావికమతం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజు దుర్గాదేవిని లలితా త్రిపుర సుందరిగా అలంకరించారు. టి.అర్జాపురంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రోలుగుంట: రోలుగుంట, బుచ్చెంపేట, కుసర్లపూడి, శరభవరం, కంచుగుమ్మల, కొమరవోలు, రత్నంపేట, కొంతలం గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాల్లో పూజలు, భక్తిగీతాలాపనలు, భజనలు జరిగాయి.

దేవరాపల్లి: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉమామహేశ్వరాలయంలో మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేశారు. రైవాడ జలాశయ కార్యాలయ ఆవరణలోని వినాయకుడి గుడిలో దుర్గాదేవికి కుంకుమ పూజలు జరిగాయి.

101 ఘటాలతో ఊరేగింపు

చీడికాడ: ఖండివరంలో ఆదివారం సాయంత్రం 101 ఘటాలతో భవానీలు ఊరేగింపు నిర్వహించారు. అప్పలరాజుపురం కొండపై అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఖండివరంలో ఘటాలతో ఊరేగుతున్న భవాని భక్తులు



సంఘ ప్రతినిధులతో తాతయ్యబాబు

తాతయ్యబాబుకు సన్మానం

చోడవరం, న్యూస్‌టుడే: హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబును వడ్డాదిలో శ్రీకృష్ణదేవరాయ తూర్పు కాపు యువజన సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు.

క్రీడాకారిణికి సత్కారం

రోలుగుంట, న్యూస్‌టుడే: గత నెలలో సింగపూర్, మలేసియాలో జరిగిన క్రీడా పోటీల్లో భారత్ తరఫున పాల్గొని మూడు బంగారు, రజత పతకాలు సాధించిన రోలుగుంటకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుని నాగజ్యోతిని నర్సీపట్నం లయన్స్ క్లబ్ (నవ్య) సభ్యులు ఆదివారం సత్కరించారు. చింతకాయల సన్యాసిపాత్రుడు, అనిత దంపతులు, వెలగా నారాయణరావు, సతీష్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

'విజన్ ఉన్న నాయకుడు.. అయ్యన్న'

నర్సీపట్నం, న్యూస్‌టుడే: శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు విజన్ ఉన్న నాయకుడని, అభివృద్ధిపై ఆయనకు సలహాలు, సూచనలు ఇచ్చే స్థాయి మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు లేదని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్ హితవు పలికారు. పార్టీ నాయకులతో ఆదివారం మాట్లాడుతూ.. వైకాపా పాలనలో మున్సిపాలిటీలో ఒక్క డ్రైనేజీ నిర్మించలేదన్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే అంగీకరించడం సంతోషకరమన్నారు. రాజా, చిట్టిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఎం.కృష్ణాపురం, కింతలి గ్రామాల్లో ఆదివారం అవగాహన సమావేశాలు జరిగాయి. సర్పంచులు వడ్డాది చారుమతిదేవి, మైచర్ల భవాని అధ్యక్షత వహించారు. కేంద్ర బృంద సభ్యులు అనిల్‌గైక్వాడ్, అనిల్ నిమ్బోకర్, ఎంపీపీ రాజారామ్, ఎంపీడీవో అప్పారావు, నాయకులు జగ్గారావు, దేముడు, సన్యాసిరావు, రమేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కె.కోటపాడు, న్యూస్‌టుడే

సమస్య: కె.కోటపాడులో బీసీ బాలికల వసతి గృహం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. చిన్నచిన్న పనులు పూర్తి చేసి ప్రారంభించాలి. – **అప్పారావు,** కె.కోటపాడు

★ భవనాన్ని స్వాధీనం చేసుకుని ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం. – **సాంబశివరావు, ఎంపీడీవో**

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

రోడ్డు అంచులో ముప్పు



చీడికాడ - తురువోలు మార్గంలో తంగుడుబిల్లి మరిడిమాంబ గుడి వద్ద కొద్దిరోజుల కిందట చెట్టు కొమ్మ విరిగిపడింది. రోడ్డు అంచు సగం వరకు కొమ్మ మొనదేలి ప్రమాదకరంగా ఉంది. రాకపోకలు సాగించే క్రమంలో వాహనచోదకులు ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాలకు గురయ్యే ఆస్కారముంది. అధికారులు స్పందించి కొమ్మను తొలగించాల్సిన అవసరముంది. – **న్యూస్‌టుడే, చీడికాడ**

పెద్దేరుపై వంతెన నిర్మాణానికి వినతి

చోడవరం, న్యూస్‌టుడే: నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పెద్దేరును ఈదుతూ పొలాలకు వెళ్తున్నాం. వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి చేర్చేందుకు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. సమస్య పరిష్కారానికి పెద్దేరుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ రామజోగిపాలెం గ్రామస్థులు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. తెదేపా నాయకుడు రొంగలి రమణ, పోతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణపులోవ అభివృద్ధికి..

చోడవరం, న్యూస్‌టుడే: కల్యాణపులోవ జలాశయం పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు కోరారు. ఈ మేరకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు.



ప్రమాదకరంగా పెద్దేరు దాటుతున్న రామజోగిపాలెం గ్రామస్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



1981-82 బ్యాచ్ విద్యార్థులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 67 మంది విద్యార్థులు 43 ఏళ్ల తరువాత ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఏడాదిగా స్నేహితుల వివరాలు సేకరించి అందరూ కలుసుకునేలా కార్యక్రమం ఏర్పాటు చేయడంపై వీరంతా ఆనందం వ్యక్తం చేశారు. అందరూ సంఘంగా ఏర్పడి పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు సంఘంగా ఏర్పడి అధ్యక్షుడిగా బోళెం గోవింద, కార్యదర్శిగా వెలగా ఆనంద్‌లను ఎన్నుకున్నారు.

కార్యాలయాల్లో స్వచ్ఛభారత్

నర్సీపట్నం/అర్బన్, న్యూస్‌టుడే: అధికారుల బదిలీలు పూర్తవడంతో ఇప్పుడిప్పుడే పాలన గాడిన పడుతోంది. బాధ్యతలు చేపట్టిన అధికారులు కార్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచేందుకు దృష్టిసారిస్తున్నారు. సబ్ కలెక్టరేట్ ప్రాంగణమంతా తుప్పలు పెరిగి ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం గమనించిన ఆర్డీవో వి.వి.రమణ ఆదివారం రెండు రోటోవేటర్లను రప్పించి శుభ్రం చేయించారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలోనూ పరిశుభ్రత పనులు మొదలయ్యాయి.



సబ్ కలెక్టరేట్ ఆవరణలో తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

బీఎన్ రోడ్డులో గోతుల పూడ్చివేత

రోలుగుంట, న్యూస్‌టుడే: బీఎన్ రహదారిలో గోతులను తాత్కాలికంగా మరమ్మతు చేసేందుకు జనసేన పార్టీకి చెందిన యువకులు ముందుకొచ్చారు. కొత్తకోట, రోలుగుంట తదితర చోట్ల గోతులను మట్టితో పూడ్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. రోలుగుంట మండల పరిషత్తు కార్యాలయం, కొత్తకోట జూనియరు కళాశాల వద్ద ఆదివారం పనులు చేశారు.

పెందుర్తి

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డి తెదేపా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం వార్డు తెదేపా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెదేపా సభ్యత్వ నమోదుకు కార్యకర్తలంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బూత్ ఇన్‌ఛార్జిలంతా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎం.రవి, చుక్క వెంకన్న, పాల నగేశ్, కాకి నారాయణ, సర్వరే ఆలం, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

పరవాడ, న్యూస్‌టుడే

సమస్య: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలోని ఎస్ఎస్10బి1/4/3 నెంబర్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు. దీంతో కారణంగా విష పురుగులు, వీధి కుక్కల సంచారంతో భయాందోళన చెందుతున్నాం. స్తంభానికి పొదలు అల్లుకున్నాయి.
– సీహెచ్.వి.రాజారావు, దేశపాత్రునిపాలెం

సమాధానం: మీ ప్రాంతంలో వీధి దీపం వెలిగేలా చర్యలు చేపడతాం.
– రౌతు శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్

పల్లెలు వ్యర్థాలమయం

పరవాడ, న్యూస్‌టుడే

స్వచ్ఛతాహీ సేవ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా గ్రామీణ ప్రాంతాల్లో సక్రమంగా అమలుకావడం లేదు. దీంతో రహదారుల పక్కన, చెత్తకుండీల వద్ద వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో ప్రజలు తరచూ అనారోగ్య బారిన పడుతున్నారు. పరవాడ మండలంలోని పలు గ్రామాల్లో గత కొద్ది రోజుల నుంచి చెత్తను తరలించకపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, గొర్లెవానిపాలెం, పరవాడ, పి.భోనంగి, కలపాకలోని రహదారుల పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ప్రయాణికులు, గ్రామస్థులు వాపోతున్నారు. దోమలు బెడద కారణంగా రాత్రుళ్లు కంటి నిండా నిద్ర కరవవుతోందని చెబుతున్నారు. చెత్తను శునకాలు, పందులు చిందరవందర చేయడంతో పరిసరాలను అధ్వానంగా తయారవుతున్నాయని వాపోతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, సంచులను పశువులు తినడంతో మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పరవాడలో రహదారిని ఆనుకుని..


వాడచీపురుపల్లిలోని ప్రధాన రహదారిలో...


తిక్కవానిపాలెంలో పేరుకుపోయిన చెత్త


వాడచీపురుపల్లి సామాజిక భవనం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రశాంత వాతావరణంలో ఊరేగింపు జరపాలి

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేసి పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు తదితర కార్యక్రమాలను కమిటీల ప్రతినిధులు ప్రశాంత వాతావరణంలో జరపాలని వెస్ట్ జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి సూచించారు. దుర్గాదేవి మండపాల నిర్వాహకులతో ఆదివారం చినముషిడివాడలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో ఏసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ బాక్సులకు అనుమతి లేదన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళలతో అశ్లీల నృత్యాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఊరేగింపు సమయంలో ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి, గోపాలపట్నం సీఐలు కె.వి. సతీశ్‌కుమార్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సవాల నిర్వాహకులకు సూచనలిస్తున్న వెస్ట్ జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

తాగునీటి వృథాకు ఏదాది

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి మరడ దాసరిపేట నుంచి నమ్మి దొడ్డి కూడలికి వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న పైపు లైను వాల్వు నుంచి తాగునీరు వృథా అవుతోంది. గత ఏడాది కాలంగా నీరు లీకవుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. కుళాయిలు విడిచిపెట్టే సమయంలో మరింత ఎక్కువ నీరు నేలపాలవుతోందని, దీనివల్ల శివారు ప్రాంతాలకు సక్రమంగా సరఫరా కావడం లేదని మహిళలు వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టి వృథాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


వృథాగా పోతున్న నీరు

అంధకారంలో సామాజిక మరుగుదొడ్డి

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు బంటూకాలనీలోని సామాజిక మరుగుదొడ్డి అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గతవారం రోజులుగా మరుగుదొడ్లకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొండవాలు ప్రాంతాల్లోని కొంతమందికి ఇప్పటికీ మరుగుదొడ్లు లేకపోవడంతో వారంతా వీటిని నిత్యం వినియోగించుకుంటున్నారు. జీవీఎంసీ జోనల్ అధికారులు సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మరుగుదొడ్ల వద్ద అలముకున్న చీకట్లు

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోంది. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ఏకలవ్య కాలనీలో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. త్వరలోనే వార్డు పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ రామారావు, పీలా జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు

మర్యాదపూర్వక కలయిక

పరవాడ, న్యూస్‌టుడే: ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బత్తుల తాతయ్యబాబును ఆదివారం పరవాడ మండలం వెన్నెలపాలెంలోని తన స్వగృహంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్యబాబును బండారు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, మాజీ సర్పంచి అట్టా సన్యాసి అప్పారావు, అనకాపల్లి జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ, చీపురుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


తాతయ్యబాబుని శాలువాతో సత్కరించిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలను ఉచితంగా కేటాయించాలి

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు ఉచితంగా కేటాయించాలని కల్లు గీత కార్మికుల జిల్లా సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. నరవలో గీత కార్మికుల 8వ మహాసభ ఆదివారం నిర్వహించారు. పలువురు సంఘం ప్రతినిధులు ప్రసంగించారు. ప్రస్తుతం మద్యం దుకాణాల కేటాయింపు 20 శాతానికి పెంచాలని సంఘం సభ్యులు కోరారు. ఎటువంటి టెండరు ప్రక్రియ లేకుండా ఉచితంగా దుకాణాలు కేటాయించాలని కోరారు. గీత కార్మికుల కుటుంబాల్లోని యువతకు ఉపాధి కల్పించడం కోసం నీరాతాటి ఉత్పత్తుల పరిశ్రమను ఏర్పాటు చేయాలన్నారు. చెట్టు మీద హక్కు కల్పించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. కేరళలో అమలు చేస్తున్న కల్లు విధానాన్ని రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంవీగ పోలయ్య, కార్యదర్శిగా జిత్తుక సంతోష్, ఉపాధ్యక్షుడిగా పట్నాక కృష్ణ, సహాయ కార్యదర్శిగా రాయి సోమునాయుడు, డైరెక్టర్‌గా దమ్ము నర్సింహంను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్ర దేముడు తదితరులు పాల్గొన్నారు.


కల్లుగీత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్ర దేముడు

ప్రసాద్ పథకం పనుల పురోగతిపై సమీక్ష

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రసాద్ పథకం పనులపై రాష్ట్ర దేవాదాయశాఖ అదనపు కమిషనర్ (ఏడీసీ) కె.రామచంద్రమోహన్ ఆదివారం సమీక్ష నిర్వహించారు. సింహగిరిపై దేవస్థానం అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో ఈవో వేంద్ర త్రినాథరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, పర్యాటక శాఖ ఏఈ మదన్‌మోహన్ పాల్గొన్నారు. సింహగిరి బస్‌స్టాండు ఆవరణలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణ పురోగతిపై చర్చించారు. బస్‌స్టాండు మధ్యలో బస్‌బే నిర్మాణానికి ఏడీసీ అభ్యంతరం తెలిపారు. ఉత్సవాల సమయంలో తగినంత స్థలం లేకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో బస్‌బే ఓ మూలన నిర్మించాలని, మిగిలిన పనులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని విన్నపం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కార్మికుల్ని అన్ని విధాలుగా భయభ్రాంతులకు గురి చేస్తున్న ఉక్కు యాజమాన్యంతో చర్చించి, వివిధ సమస్యలు పరిష్కరించాలని ఉక్కు పోరాట కమిటీ నాయకులు కోరారు. ఆదివారం వారు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతులు అందించారు. ఇంటి అద్దె చెల్లించాలని, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ.. ఈడీ(వర్క్స్) కార్యాలయం వద్ద సుమారు 24 గంటల పాటు నిరసన తెలియజేసినా, ఓ మహిళా ఉద్యోగి అస్వస్థతకు గురైనా అధికారులు స్పందించలేదని వివరించారు. సకాలంలో వేతనాలు అందక యువ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ఎంపీ శ్రీభరత్‌తో కలిసి ఉక్కు సీఎండీ ఎ.కె.సక్సేనాతో చర్చించేందుకు చొరవ చూపాలని పల్లాను కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, జి.నరేంద్రకుమార్, ఎన్.సింహాద్రి, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు సమస్య వివరిస్తున్న ఉక్కు నాయకులు

నేడు సబ్బవరంలో ఎమ్మెల్యే పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం సబ్బవరం మండలంలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను మండల జనసేన అధ్యక్షుడు కర్రి కనకరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడులోని సంజీవని డెంటల్ ఆసుపత్రి ప్రారంభోత్సవం చేస్తారన్నారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంపై నిర్మించిన మొదటి అంతస్తు భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా పరవాడ బొంకులదిబ్బలోని దుర్గాదేవి మండపం వద్ద ఆదివారం రాత్రి మ్యూజికల్ ఛైర్, తాడాట, లెమన్ అండ్ స్పూన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో విద్యార్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటారు. విజేతలకు దసరా రోజున బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. ఉదయం ఆలయ హంస మూలన పండితులు శ్రీమద్రామాయణం పారాయణం చేశారు.

గంజాయి విక్రయిస్తున్న నిందితుడి అరెస్టు

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి నార్కట్‌పల్లి శివారులో విద్యార్థులకు విక్రయిస్తున్న ఓ యువకుడిని నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండల కేంద్రంలోని ద్రోనంరాజు నగరానికి చెందిన సాగి దిలీప్‌వర్మ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా హైదరాబాద్‌లో 2 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కొంత మేరకు అక్కడే విక్రయించగా మిగిలిన 650 గ్రాముల గంజాయిని శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై నార్కట్‌పల్లి శివారులోని స్పెక్ట్రా వెంచర్‌కు తీసుకొచ్చి ఓ కళాశాల విద్యార్థులకు, ఇతర వ్యక్తులకు చిన్న చిన్న పొట్లాల్లో నింపి విక్రయించడానికి సిద్ధమయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై క్రాంతికుమార్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తనిఖీలు చేయగా దిలీప్‌వర్మ అనుమానస్పదంగా కనిపించాడు. అతన్ని విచారించి 8 పొట్లాల్లోని సుమారుగా రూ.16,500 విలువగల గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరిపైన కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వివరించారు.

లలితా స్వరూపిణి.. శ్రీచక్ర సంచారిణి


సుజాతనగర్‌లో లలితా త్రిపురసుందరి


మహాలక్ష్మి అలంకరణలో నాయుడుతోట గాయత్రీదేవి


శమశక్తినగర్‌లో కరెన్సీ నోట్లతో అలంకరణ


గవరజగ్గయ్యపాలెంలో..


పెందుర్తి ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..


పరవాడ బొంకులదిబ్బలో దీపారాధన

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగన్మాత ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని శ్రీలలితా అష్టోత్తర శతనామావళితో అర్చించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని లలితా సహస్రనామ పారాయణం చేశారు. పలు చోట్ల అన్నదానాలు జరిపారు.


– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


మణిపురంలో..


దేవీపురం శ్రీరాజరాజేశ్వరి


దుర్గానగర్‌లో..


పోలిపల్లి కూడలిలో..


వాడచీపురుపల్లిలో..


ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో..


శారదాపీఠంలో...


రాంపురం మహాకామేశ్వరీ పీఠంలో...


పెందుర్తి రాజుచెరువులో..


సాయినగర్‌కాలనీలో..


పిట్టవానిపాలెంలో అన్నసమారాధన


కృష్ణానగర్‌లో..


ఎస్ఆర్‌పురంలో..

పల్లె దారి.. అధ్వానంగా మారి

ఫోకస్

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని రాజు గారి బంజరు నుంచి నారపాడు వెళ్లే సుమారు 4 కిలోమీటర్ల రహదారి ధ్వంసమై దారుణంగా తయారైంది. ఈ రహదారి గుండా సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిందరికీ ఈ రోడ్డు తప్ప మరో దిక్కులేదు. ప్రస్తుతం భారీ గుంతలతో రాళ్లుతేలి ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనదారులు, ఆటోలు రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నారు. తాము పండించిన కూరగాయలను నగరంలోని రైతు బజార్లకు తీసుకెళ్లేందుకు ముప్పుతిప్పలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. గత పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, కూటమి నాయకులైనా చర్యలు తీసుకుని బంజరు నుంచి నారపాడు వరకు రహదారి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బల్జిపాలెం సమీపంలో ధ్వంసమైన నారపాడు రహదారి

పగటి వెలుగులు ఆగేదెన్నడో..?

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలోని హైమాస్టు దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీనివల్ల దీపాలు తరచూ మరమ్మతులకు గురవ్వడంతో పాటు విద్యుత్తు వృథా అవుతోంది. విద్యుత్తును పొదుపు చేయాలని అవగాహన కల్పించే అధికారులే ఇలా వృథా చేయడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



దర్పణం

మురుగుతో ముప్పుతిప్పలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కాలువలు లేక ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. ఎస్టీబీఎల్ సినిమాహాలు రహదారిలో మురుగు నిలిచిపోవడంతో ఈగలు, దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. కొన్నిచోట్ల కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో మట్టి మేటలు వేసి నీరు నిలిచిపోతోంది. దీనికి వర్షపు నీరు తోడవ్వడంతో మురుగంతా రహదారులపై ప్రవహిస్తోంది. పాలకులు, పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నిలిచిపోకుండా కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


ఎస్టీబీఎల్ సినిమా హాలు వీధిలో మురుగు

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీ

ఎండాడ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పగలు, రాత్రి ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చర్యల విషయంలో ట్రాఫిక్ పోలీసులు చురుగ్గా వ్యవహరించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సిబ్బందికి బాధ్యతలు గుర్తు చేశారు. ఎండాడ కూడలిలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని శనివారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు.